ప్రజాశక్తి

మంగళవారం 5 సెప్టెంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

చీరల పంపిణీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో పిటిజి వయోవృద్ధ మహిళలకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం, విశాఖ జిల్లా అధ్యక్షుడు పిబి.శ్రీనివాస్ ఆర్థిక సాయంతో ఉచిత చీరలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి మాట్లాడుతూ నిరుపేద గిరిజనులకు ఎంతోకొంత సేవల ందించాలన్న ఉద్దేశంతో ఇటువంటికార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న కృష్ణకుమారి

దద్దరిల్లిన మండల కార్యాలయాలు

-అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలు, నిరుద్యోగంపై సిపిఎం ఆందోళనలు - తరలివచ్చిన గిరిజనులు

అరకులో నినాదాలు చేస్తున్న సురేంద్ర, నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలు, పెంచిన నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు, నిరుద్యోగ సమస్యపై సిపిఎం గత వారం రోజులుగా నిర్వహిస్తున్న సమరభేరి పోరు సోమవారం మండల కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలతో ముగిసింది. ఈ కార్యక్రమాల్లో ఆదివాసీ యువత విద్యార్థులు, కార్మిక వర్గాలు, పలు గిరిజన సంఘాలు, మహిళలు పాల్గొని తమ నిరసనలను వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా గత నెల 30 నుండి ఈ నెల 4వ తేదీ వరకు గ్రామంలో సిపిఎం నాయకులు పర్యటించి ప్రభుత్వ విధానాలపై ప్రచారం నిర్వహించారు.సోమవారం ముగింపు సందర్భంగా గిరిజన సంఘం కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం డిప్యూటి తహశీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ చట్టం అమలు చేస్తే అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, గ్రామ సభ వంటి చట్టాలకు నష్టం జరుగుతుందని దీంతో గిరిజనులకు అడవిపై హక్కు లేకుండా పోతుందని తక్షణమే రద్దు చేయాలన్నారు. సిపిఎం నేతలు పొద్దు బాలదేవ్, రామారావు, జె.భగత్ రాం, బుజ్జి బాబు, కె జగన్నదం పాల్గొన్నారు.

పాడేరు:పార్టీ మండల కార్యదర్శి ఎల్. సుందర్‌రావు, నాయకులు పి.లక్కు, కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యాలయం నుండి పాడేరు మెయిన్ రోడ్డు గా పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించి ఆ కార్యాలయాల వద్ద బైఠాయించి ధర్నా జరిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని మోడీ ఇచ్చిన హామీనీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలతో మూతపడిన ప్రభుత్వ, ప్రవేట్ చిన్న తరహా పరిశ్రమల నుండి 2 కోట్ల మందికి ఉద్యోగాలు ఊడిపోయి రోడ్డున పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుందర్‌రావు పాల్గొన్నారు.

హుకుంపేట:మండల కేంద్రంలో పార్టీ కార్యక్రమం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు అనంతగిరి జడ్పీటీసీ, సీపీఎం జిల్లా నాయకులు గంగరాజు మాట్లాడుతూ,మండలంలో 60 శాతం గ్రామాలకు రోడ్లు సక్రమంగా లేవన్నారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సొంటేన హైమావతి, మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, నాయకులు తమర్భ అప్పలకొండల పడాల్, తాపుల కృష్ణా రావు, పాంగి సోమన్న, పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: జీఓ 3 రద్దుతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోయారని సిపిఎం అల్లూరి జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో సిపిఎం నాయకులు మూడు రోడ్ల జంక్షన్ నుంచి తసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. అఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, నాయకులు పి.సురేష్ కుమార్, పి.సత్యనారాయణ, .డుంబు పాల్గొన్నారు.

పాడేరులో మాట్లాడుతున్న అప్పలనర్స

ముంచింగిపుట్టు: సిపిఎం కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీగా తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల కార్యదర్శి పాంగి భీమరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ మాట్లాడారు. సిపిఎం మండల నాయకులు కె నర్సయ్య, భీమరాజు, కె.శంకర్, నారాయణ, వి లైకోన్, విక్రమ్, భీమన్న, నీలకంఠం పాల్గొన్నారు.

జిమాడుగుల:మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకురాలు వి.వి.జయ, నాయకులు సాగిన ధర్మన్న పడాల్, దీనబంధు, ధర్మారావు, కోటి బాబు, నిరుద్యోగుల సంఘం మండల నాయకులు పి.చిన్నారావు, శ్రీలత, రాంనాయుడు, కే,దేవినాయుడు, రాము పాల్గొన్నారు.

కూనవరంలో వినతిపత్రం ఇస్తున్న కిరణ్, నేతలు

అనంతగిరి:స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ వారపు సంత మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకులు దాడల సుబ్బారావు మాట్లాడుతూ, వెంటనే గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాక్ లాక్ పోస్టులు పోస్టులను భర్తీ చేయాలన్నారు.టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో. మోస్య, పార్టీ మాజీ సర్పంచ్ సీవేరి. కొండలరావు పాల్గొన్నారు

పెదబయలు: తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, నాయకులు శర్బన్న, బొండా గంగాధరం, చెండా రామారావు, భాషా వాలంటీర్ల సంఘం నేతలు వీరయ్య, టీ బంగారయ్య, కామేష్ పాల్గొన్నారు.

కూనవరం :పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. సిపిఎం సమరభేరిలో భాగంగా సీపీఎం కూనవరం మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల నష్టపోతున్న ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచ్ నాగమణి, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, పాయం సత్యనారాయణ, కుంజా రాధ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చింతూరు : మండల రెవెన్యూ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కారం సుబ్బారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడారు. నాయకులు పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మల్లం సుబ్బమ్మ, రంగమ్మ, ఎంపీటీసీ రాజకుమార్ పాల్గొన్నారు.

హుకుంపేటలో వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, నేతలు

విఆర్.పురం : తప్పుడు తడకల కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 1986, 2022 వరదల ఆధారంగా ముంపునకు గురైన అన్ని గ్రామాల ప్రజలకు పోలవరం ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పునెం సత్యనారాయణ, సర్పంచులు పూనెం సరోజిని, వెట్టి లక్ష్మి, ఎంపీటీసీ పూనం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, నాలారపు ప్రకాష్, గూటాల శ్రీను, ఖాదర్‌పాల్గొన్నారు.

ఎటపాక : సిపిఎం ఆధ్వర్యంలో ఎటపాక మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఆకిసెట్ రాము, ఐ.పద్మ, జయమ్మ ఇరపా సత్యం, తోట శ్రీను పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుత రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు నుండి మండల రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడారు. సిపిఎం నాయకులు కొండ్ల సూరిబాబు, మేలిన రమేష్, కుంజం జగన్నాథం, పాల్గొన్నారు.

సీలేరు : జికె.వీధి తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొనంగి చిన్నయ్య పడాల్, మండల కార్యదర్శి ఎ.బుజ్జిబాబు, నాయకులు గడుతూరి సత్యనారాయణ, కొర్ర బాలయ్య, బాబురావు పాల్గొన్నారు.

కొయ్యూరు : అల్లూరి జిల్లా కొయ్యూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు, నాయకులు మెరిసి జయలక్ష్మి, జె.పెంటయ్య, కుమార్ పాల్గొన్నారు. నాయకులు వై.అప్పలనాయుడు, పి.బొంజన్న, రాజన్న పాల్గొన్నారు.

అనంతగిరిలో ప్రవహిస్తున్న నీరు

వర్షం.. హర్షం

ఖరీఫ్ పైర్లుకు ప్రయోజనం

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. అనంతగిరి మొదలుకొని సీలేరు వరకు అన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. పాడేరు నియోజకవర్గంలోని చింతపల్లి, జికె వీధి మండలాల్లో సోమవారం ఉదయాన్నే వర్షం మొదలైంది కాగా అనంతగిరి, నుంచి పాడేరు వరకు అరకు, డుంబ్రిగూడ, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, జిమాడుగుల, మండలాల్లో సోమవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. రెండు రోజులుగా ఏజెన్సీలో తేలికపాటి వర్షాలు కురిసాయి.సోమవారం పొద్దుగూకే సమయానికి ఏజెన్సీలోని 11 మండలాల్లోనూ వర్షం విస్తరించింది.

ప్రస్తుతం ఏజెన్సీలో ముమ్మరంగా కాపీ ప్లాంటేషన్, రాజ్మా సాగు, ఇతర ఖరీఫ్ వ్యవసాయ పనులను ముమ్మరంగా గిరిజన రైతులు నిర్వహిస్తున్నారు. అన్ని మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ఖరీఫ్ వ్యవసాయ పనులకు సానుకూలంగా ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో దాదాపు వరినాట్లు పూర్తి కావచ్చాయి. ఏజెన్సీలో ఖరీఫ్ వరికి వర్షాధారమే ప్రధానం కావడంతో ప్రస్తుతం మన్యం అంతట భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు వరి పంటకు మేలు చేస్తాయని రైతులు కూడా చెప్తున్నారు.

కుండపోత వాన

అనంతగిరి : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం పదిగంటలకు వేసవిని తలపించేలా ఎండలు మండినా, ఆకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు వచ్చి కుండపోత వర్షం కురిసింది. ఉదయం పదిగంటలకు మొదలైన వర్షం మధ్యాహ్నం మూడు గంటల వరకు పడింది.దీంతో ఎక్కడినీరు అక్కడే తేలిపోయింది. కొద్ది రోజులుగా వర్షం లేక విలవిల్లాడిన రైతులు, తాజాగా కురిసన భారీ వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో కొండవాగులు, గెడ్డల్లో భారీగా నీరు ప్రవహించింది. గ్రామాల్లో డ్రైనేజీలు ఉప్పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరి నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

టి.పెంటవీడు ఉప సర్పంచ్‌గా

సిపిఎం సభ్యురాలు మణికుమారి ఏకగ్రీవం

ప్రజాశక్తి -ఎటపాక

త్రిపుర పెంటవీడు పంచాయతీ ఉప సర్పంచ్‌గా సిపిఎం వార్డు సభ్యురాలు గద్దల మణికుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గద్దల వసంతకుమార్ మరణానంతరం అదే స్థానం నుంచి ఇటీవల వార్డు సభ్యురాలిగా మణికుమారి ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మణికుమారికి రిటర్నింగ్ అధికారి నీలి బాలరాజు ధ్రువీకరణ పత్రం అందజేశారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న మేడిగట్టు గ్రామస్తులు

పాఠశాలను పున:ప్రారంభించాలి

ఎంఇఒకు సిపిఎం ఆధ్వర్యాన మేడిగట్టు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని మేడిగట్టు గ్రామంలోని పాఠశాలను పున:ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి కోరారు. సోమవారం గ్రామస్తులతో కలిసి, ఎంఇఒ సరియం రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ 2018 నుంచి మేడిగట్టు గ్రామంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను ఈ ఏడాది విద్యాసంస్కరణలో భాగంగా తెరవకుండా, గ్రామానికి చెందిన విద్యార్థులను తునికిచెరువు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని సూచిస్తున్నారన్నారు. దీనిపై గ్రామస్తుల నుంచి అభ్యర్థన మేరకు సిపిఎం నేతలు స్పందించి, వెంటనే సమస్యను ఎంఇఒ దృష్టికి తెచ్చారు.సమస్యను సత్వరమే పరిష్కరించాలని, మేడిగట్టులో పాఠశాలను తిరిగి ప్రారంభించే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆకిశెట్టి రాము, ఇరపాసత్యం, తోట శ్రీను, మేడిగట్టు గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సు, లారీ ఢీ : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలం లోని ఈతలపాడు గ్రామ సమీపంలో గోకవరం వైపు నుండి వేగంగా వస్తున్న లారీ, అమలాపురం డిపోకు చెందిన ఆర్‌టిసి డ్రైవర్ల శిక్షణ బస్సును ఢీకొట్టింది ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరికి, శిక్షణ పొందుతున్న ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి వైద్యసేవలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన రంపచోడవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన లారీ

'భవిష్యత్తు గ్యారెంటీ'ని జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

మాట్లాడుతున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్

టిడిపి అధిష్టానం ఆదేశాల మేర బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పాడేరు కుమ్మరిపుట్టు టిడిపి కార్యాలయంలో టిడిపి శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ టిడిపి చేపట్టబోయే వివిధ అంశాలపై వివరించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్, క్లస్టర్ ఇంచార్జ్ లు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం ఎలా సేకరించాలన్న అంశాన్ని, మొబైల్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణ, ఆయా మండలాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జీలు, నియోజకవర్గ ముఖ్య నాయకులు చిట్టిబాబు, గబ్బాడ సింహాచలం, గంగపూజ శివకుమార్, కోడా వెంకటసురేష్, కుమారి, నాగభూషణం, పూర్ణచంద్రరావు, కొండలరావు, వెంకటరమణ, బుద్ధ జ్యోతి కిరణ్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీపై విస్తృత ప్రచారం

బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు సీఎం అయితే ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, అన్నదాత పథకం ద్వారా రైతుకు ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం, చదువుకున్న నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పన, ఒక ఇంట్లో 18 ఏళ్లు నిండిన మహిళలు నెలకు రూ.4,500 చొప్పున ఏడాదికి రూ.54వేలు, ఇస్తామన్నారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించి అంశాలపై ప్రజలకు వివరించి, టిడిపి అధికారంలోకి వచ్చే ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో వివరించాలని ఈశ్వరి సూచించారు. వివరాలన్నీ నేరుగా ఒక ప్రత్యేక పోర్టల్లో నమోదు చేయాలన్నారు.

రంపచోడవరం : మండలంలోని రంప గ్రామంలో సోమవారం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ(కార్యక్రమాన్ని టిడిపి నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 25 కుటుంబాల సభ్యుల వివరాలను రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ, టిడిపి అధికారంలోకి వస్తే, భవిష్యత్ గ్యారెంటీలో భాగంగా నిరుద్యోగులకు నెలకు రూ.మూడు వేలు భృతి, రైతు కుటుంబాలకు ఏటా రూ.20వేలు పెట్టుబడిసాయం, ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500, కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి తల్లికి వందనం కింద ఏటా రూ.15వేలు సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు తదితర సంక్షేమ పథకాలనుఅందిస్తామన్నారు. ఈ మేరకు ష్యూరిటీ పత్రాలను ఇంటింటా అందించారు. కార్యక్రమంలో టిడిపిమండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కారం సింహాచలం, యూనిట్ ఇన్‌ఛార్జి మడకం పండు దొర, బూత్ ఇన్‌ఛార్జి కొమరం బుజ్జి దొర,బాపన్న దొర, బాబ్జి తెలుగు మహిళలు పాల్గొన్నారు.

విఆర్ పురం : మండలంలోని ఉమ్మడివరం, రాజుపేట గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి సూచనలతో బాబు ష్యూరిటీ, భవిషత్ గ్యారెంటీ కార్యక్రమాలను టిడిపి నేతలు నిర్వహించారు. ఉమ్మడివరంలో11 కుటుంబాలు, రాజుపేటలో ఆరు కుటుంబాల వివరాలను ఫోన్ ద్వారారిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి బురక కన్నరావు, జెడ్‌పిటిసి వాళ్ళ. రంగారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ముత్యాల. రామారావు, సవలం. రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు పాయం. రామారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాశరావు, సుదర్శనరావు, ఉపసర్పంచ్ పాయం లక్ష్మణ్, పాయం సుబ్బారావు, సోడే. సీతారామయ్య , సోడే. వెంకటరమణ మూర్తి పాల్గొన్నారు.

విఆర్.పురం మండలంలో ప్రజలకు కరపత్రాలు ఇస్తున్న టిడిపి నాయకులు

ఇద్దరికి అంగన్వాడీ టీచర్లుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి పంచాయతీ గిన్నెపల్లి అంగన్వాడీ కేంద్రంలోని హెల్పర్ సుబ్బలక్ష్మికి, అలాగే ఫోక్స్ పేట పంచాయతీ దిరిసనపల్లి అంగన్వాడీ కేంద్రం హెల్పర్ సూరమ్మలకు అంగన్వాడీ టీచర్లగా ప్రమోషన్ లభించింది. సోమవారం వారికి ప్రమోషన్ పత్రాలను ఎమ్మెల్సీ అనంతబాబు అందజేశారు. కార్యక్రమంలో సిడిపిఒ సంధ్య ఎంపిపి బంధం శ్రీదేవి, ముసురుమిల్లి ఎంపిటిసి వంశీ, పంచాయతీ సర్పంచ్ కోసు రమేష్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణ, సీతపల్లి గుడి చైర్మన్ బొబ్బ శేఖర్, ముసురుమిల్లి సచివాలయం కన్వీనర్ రాజన్నదొర, వైసిపి యూత్ ప్రెసిడెంట్, సోషల్ మీడియా కో-కన్వీనర్ రాపాక సుధీర్, పండా నాగన్నదొర, పాల్గొన్నారు.

ప్రమోషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

స్పందన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం

: వ్యక్తిగత, సామాజిక సమస్యలపై స్పందనలో వచ్చిన వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశమందిరంలో నిర్వహించిన స్పందనలో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి సబ్‌కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వినతులను స్వీకరించారు. సమస్యలను సంబంధిత అధికారులకు నివేదించి పరిష్కారచర్యలు చేపడతామని అర్జీదారులకు సూచించారు. ఈ వారం స్పందనలో 20 అర్జీలు రాగా, రంపచోడవరం మండలం బి.రామన్నపాలెం గ్రామంలో శ్మశానవాటికలో షెడ్, బోరు ఏర్పాటు చేయాలని సిహెచ్ రాంబాబు దొర, మడకం బాపన దొర, చవలం వెంకన్నదొర దరఖాస్తు సమర్పించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు అడవి హక్కుల చట్టం ద్వారా పట్టాలు ఉన్న వారిని నష్టపరిహారం ఇవ్వాలని పూడిపల్లి సర్పంచ్ కలుం నరసాయమ్మ, కాలుం శ్రీనివాస్ దొర, కొమరం వీరమణి వినతిపత్రం అందజేశారు. అర్హులైన గిరిజనులకు ఇళ్లు, చేయూత, బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు. మంజూరు చేయాలని పెదగెడ్డ యువజన సంఘం నాయకులు కె. రవి, విందెల సీతారామారావు పిఒకు విన్నవించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్‌రాజ్. డిఎస్ శాస్త్రి. డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఎడిఎలు కెసిహెచ్‌వి. చౌదరి, కె. సావిత్రి, పిఎఒ రాంబాబు, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రకాశరావు, సీనియర్ మేనేజర్ ముర్ల నాగవెంకట రాజారెడ్డి, సిడిపిఒ ప్రసన్నకుమారి, ఎంపిడిఒ హరికృష్ణ, డాక్టర్ ఇందిరా, వెలుగు ఎపిడి ఎ. శ్రీనివాసరావు. డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, ఇఇ ఎండి.యూసఫ్. డిఇఇలు సాయి సతీష్, చైతన్య, రాజేంద్రబాబు, రంగనాథ్, లీగల్ సెల్ల్ న్యాయవాది కెవివి సత్యనారాయణ. పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కొత్త పింఛన్ల అందజేత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మంప పంచాయతీ పరిధిలో కొత్తగా పింఛన్లు మంజూరైన 11మంది లబ్ధిదారులకు సోమవారం మంప గ్రామ సచివాలయంలో ఎంపిపి బడుగు రమేష్. సర్పంచ్ ఇంగువ త్రినాధమూర్తి పడాల్ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి పవన్ సడ్డా సావిత్రి, వాలంటీర్లు, మండల పార్టీ అధ్యక్షులు జె.బాబులు, అధ్యక్షులు ముసలినాయుడు, రామ్మూర్తి పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపిపి రమేష్

ప్రయాణ సంకటంగా రహదారులు

- ఏళ్ల తరబడి నిర్వహణ లేక అధ్వానస్థితికి..
- ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకోని వైనం
- అధికారులు, నేతల నిర్లక్ష్యంపై జనం మండిపాటు

బురద, గోతులమయంగా స్టేట్ బ్యాంకుకు వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలంలో అధ్వానంగా ఉన్న పలు రహదారుల్లో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. నిండా గోతులమయమై రూపు కోల్పోయిన రోడ్లు, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు నిండి, నిండా బురదమయమై ప్రమాదభరితంగా తయారయ్యాయి. మండల కేంద్రానికి రేఖపల్లి జంక్షన్ మలుపు వద్ద ధర్మతాలగూడెం ఊరు చివర నుండి కూనవరం వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి రోడ్డు దుస్థితి దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇక మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, బ్యాంకులకు వెళ్లే మార్గంలో రోడ్డు అధ్వానస్థితిలో ఉండడంతో కాలినడకన కూడా వెళ్లలేని స్థితిలో ఉంది. ఇక వాహనాల్లో వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. నిత్యం వాహనరాకపోకలతో రద్దీగా ఉండే మార్గంలో కూడా రోడ్లు పూర్తిగా పాడై, ప్రయాణసంకటంగామారినా కనీసం పట్టించుకునే దిక్కులేదు.

అంతంతమాత్రంగా ఉన్న ఈ రోడ్లు గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మరింత శిథిలావస్థకు చేరుకుంటున్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా రోడ్ల దుస్థితిని పట్టించుకునే వారు లేకపోవడం, రోడ్లు పునర్నిర్మాణాలను పక్కనబెడితే, ఏళ్ల తరబడి మరమ్మతులైనా చేసే దిక్కు లేకపోవడంతో ప్రయాణసంకటంగా మారి ప్రజలు, వాహనదారులను నానా ఇక్కట్లకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు.

ప్రధానరోడ్లు కాస్తా గోతులమయమై, చినుకు రాలితే నీటి కుంటలను తలపిస్తూ, పలుచోట్ల బురద, జారుడుమయమై, ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాలు, గాయాలు పాలయ్యే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇక గ్రామీణ రోడ్లయితే, మట్టిదిబ్బలుగా మారడంతో రోడ్ల మధ్యలోనే కాలువలుగా మారి ఎక్కడికక్కడే నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. నిండాగోతులమయమైన రోడ్లలో కుదుపుల ప్రయాణంతో ఒళ్లు హూనమవ్వడమే కాకుండా, వాహనాలు కూడా తరచూ మరమ్మతుకు గురవుతున్నాయని యజమానులు వాపోతున్నారు. బైక్‌లు, ఆటోలు, కార్లు, ఇతర చిన్నవాహనాలు నడిపే టప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాలకు గురవ్వడం ఖాయమని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇక అత్యవసర సమయంలో, రాత్రి వేళల్లో ప్రయాణాలంటే ఎంత కష్టమో వేరే చెప్పనక్కరలేదు. గర్భిణులు, రోగులు ఈ రోడ్లపై ప్రయాణమంటే, గమ్యంచేరేసరికి ఏమౌతుందో తెలియని పరిస్థితి ఉందని, ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులతోపాటు నేతలు రోడ్లు దుస్థితిపై దృష్టిపెట్టి తక్షణ మరమ్మతులు చేపట్టడంతోపాటు శాశ్వత పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నికలప్పుడు వచ్చి, సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీలిచ్చే నేతలు ఇపుడు ఎక్కడున్నారని వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మట్టిరోడ్డుగా మారిపోయిన తారురోడ్డు

రేఖపల్లి జంక్షన్ మలుపు వద్ద పూర్తిగా ఛిద్రమైన రోడ్డు

నిధుల దారి మళ్లింపుపై నిలదీత

- గడపగడపలో ఎమ్మెల్యే ఫాల్గుణకు చేదు అనుభవం
- పివిటిజిలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ప్రశ్నలు
- సమాధానం దాటవేసి ముందుకు సాగిన వైనం

ఎమ్మెల్యే ఫాల్గుణను నిలదీస్తున్న తడిగిరి ఉప సర్పంచ్ రామారావు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయితీ, ముల్లుమెట్టలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణకు చేదు అనుభవం ఎదురైంది. సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తర్వాత పివిటిజిల పథకాలకు, నిధులకు ఎసర పెట్టారని ,ఆ పంచాయితీ ఉప సర్పంచ్, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు కిల్లో రామారావు నిలదీసి ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పివిటిజి గిరిజనులకు 35 కేజీల బియ్యాన్ని ఇచ్చే అంత్యోదయ రేషన్ కార్డులను రద్దు చేశారని, సిసిడిపి నిధులు అందడం లేదని ఆరోపించారు. పివిటిజి గ్రామాల్లో అభివృద్ధికి కేటాయించిన సిసిడిపి నిధులను వేరే పనులు, పథకాలకు మళ్లించడం వల్ల ఆయా గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీ, సామాజిక భవనాలు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు లేక ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఇప్పటికీ 60 శాతం గ్రామాలకు తారు రోడ్లు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వం పివిటిజిలకే కాకుండా, అన్నీ గిరిజన గ్రామాల పంచాయతీల నిధులు దాదాపు రూ.9 వేల కోట్లను జగన్ ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు నోచుకోలేని పరిస్థితి ఉందని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. జిఒ3రద్దుతో గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా ఎందుకు ప్రశ్నించడం లేదని, ఆ జిఒ పునరుద్ధరణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ చర్యలతో గ్రామాల్లో సమస్యలను పరిష్కరించలేక, అభివృద్ధి పనులు చేపట్టక సర్పంచ్‌లు, ఎంపిటిసి తలెత్తుకు తిరగలేకపోతున్న విషయాన్ని తెలిసినా ఎందుకు ముఖ్యమంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే ఫాల్గుణ స్పందిస్తూ, అందరికీ నవరత్న పథకాలను అందించడం ద్వారా సమన్యాయం చేయాలని ప్రభుత్వం చూస్తోందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే ఆదివాసీ గిరిజనులకు అన్యాయం జరుగుతోంది కదాయని ప్రశ్నించేసరికి, సమాధానం దాటవేసి, ముందుకు సాగిపోయారు. కార్యక్రమంలో ఎంపిటిసి భీమలింగేశ్వరరావు, సర్పంచ్ రంజిత్‌కుమార్, ఎస్ కొండలరావు. సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల పిల్లలకు ఉద్యోగ భరోసా

- సీడాప్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
- 2400 మందికి ప్లేస్‌మెంట్ లక్ష్యం
- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

మాట్లాడుతున్న పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగ పిల్లలకు ఉచిత శిక్షణనిచ్చి, శతశాతం ఉద్యోగావకాశాలను కల్పించనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఉపాధిహామీ పథకం కూలీల పిల్లలకు సీడాప్ అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. 2400మంది గిరిజన నిరుద్యోగులకు శిక్షణనిచ్చి ఉద్యోగకల్పన లక్ష్యమన్నారు.

సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల పరిధిలోని శిక్షణకు అర్హులు, ఆసక్తి ఉన్న అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఈనెల 6న పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు, 8న అరకు వ్యాలీ, అనంతగిరి, డుంబ్రిగుడ 11న జి.కె. వీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాల వెలుగు కార్యాలయంలో ఎంపిక మేళాను నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఏ మండలంలోనైనా ఎంపికలకు హాజరుకావచ్చని సూచించారు.

ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన కూలీల పిల్లలకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించి శిక్షణ నిచ్చి, శిక్షణానంతరం శతశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తార న్నారు. ఉపాధి కూలీల కుటుంబాలలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన పిల్లలకు ఉన్నతి కార్యక్రమం కింద శిక్షణ అందిస్తార న్నారు.

లాజిస్టిక్స్ వేర్‌హౌస్ సూపర్‌వైజర్లు, రిటైల్ రంగంలో శిక్షణ, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ శిక్షణ అందిస్తారన్నారు. 18-35 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులకు శిక్షణ కాలంలో రోజుకు రూ.272 లు స్టైఫండ్‌ను 15 రోజులకు ఒకసారి అభ్యర్థుల ఖాతాలకు జమ చేస్తారని, అయితే శిక్షణకు 75శాతం హాజరు ఉండాలన్నారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఎస్ఆర్‌టిపి, వైస్‌మేన్ పవర్ సొల్యూషన్స్, డేటాప్రో, క్రైట్స్ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నామని, నిరుద్యోగ గిరిజన యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు.కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిడి జె. గిరిబాబు, ఎంపిడిఒ వెంకటరావు, జెడి ఎం.కల్యాణి, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల క్వార్టర్స్‌ను వేగంగా పూర్తిచేయండి

పాడేరు : స్థానిక మలేరియా కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న వైద్యాధికారుల నివాసగృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. సోమవారం రూ.1.50కోట్ల ఎన్ఒజిఐఎ నిధులతో నిర్మిస్తున్న డాక్టర్స్ క్వార్టర్స్ నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణాలలో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని సూచించారు. ప్రవేశ మార్గం, పార్కింగ్, మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకు నిర్మాణాలపై పలు సూచనలు చేసారు. పనులను వేగవంతం చేసి వినియోగంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ఎం. రాజు, డిఇఇ అనుదీప్, ఎఇఇ దేముళ్లపాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలోని గెమ్మిలి పంచాయతీ కేంద్రంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లిభాగ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది విధులను నిర్వహించాలని సూచించారు కార్యక్రమంలో జెడ్‌పిటిసి మత్స్యరాస వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి కుడుముల సత్యనారాయణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, మండల నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

లెమన్‌స్పూన్ పోటీల్లో పాల్గొంటున్న మహిళా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -హుకుంపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని జిపిఎస్, ఎంపిపిఎస్, ఇతర పాఠశాల ఉపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఎంఇఒలు సోమేలి చెన్నయ్య, ఈశ్వరరావు ఆధ్వర్యంలో క్రీడ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు. మ్యూజికల్ ఛైర్, రింగ్ టెన్స్, లెమన్‌స్పూన్, వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలు పోటీలను నిర్వహించగా, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని ఎంఇఒలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మత్స్యరాజు, చిన్నారావు,మోదకొండ, ప్రభాకర్, సత్యారావు, రాజబాబు సత్యనారాయణ, వాసుదేవ్, వెంకటరమణ, పాల్గొన్నారు.

సురేష్ శాంతోకు ఘన నివాళి

సురేష్ శాంతో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్థానికులు, సహచర విలేకరులు

ప్రజాశక్తి - మాడుగుల :మాడుగులలో సీనియర్ పాత్రికేయులు, ప్రజాశక్తి విలేకరి సురేష్ శాంతో అకాలమరణంపై మాడుగులలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి మాడుగుల బస్‌స్టాండ్ ఆవరణలో బస్ షెల్టర్‌లో సురేష్ శాంతో చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు. పుట్టా గంగయ్య, రొబ్బా మహేష్, పాలకుర్తి సురేష్ కుమార్, పుట్టా బలరాం, మరువాడ ఈశ్వరరావు, ఢిల్లీ నానాజీ, బైరా శ్రీనివాసరావు, గౌరీపట్నం మహేష్ కుమార్, మణికంఠ. లక్కీడపు సుందరరాజు, కుంచా మధు, జాగాని ఈశ్వరరావు, కొప్పాక రాంకి. తాళపు రెడ్డి నాగచంద్ర. ఆంధ్రజ్యోతి తాకాసి శ్రీను, లీడర్ సురేష్, మంచాల శివ, చల్లా రామస్వామి పాల్గొన్నారు.

త్వరితగతిన పార్కుల ఆధునికీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పార్కుల ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మూడవ జోన్ పరిధిలోని శివాజీ పార్కు, సీతమ్మధార స్నేహర్ పార్కుల ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివాజీ పార్కులో ఆధునీకరణ పనులలో వాటర్ ఫౌంటైన్, పెయింటింగ్, లైటింగ్, పచ్చదనం పెంపొందించడం సందర్శకులు కూర్చునే బల్లలు, తాగునీరు, మరుగుదోడ్డు, క్యాంటీన్ మొదలైన పనులు ఈ నెలాఖరునాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. పార్కులో పారిశుధ్య నిర్వహణ బాగాలేదని, తాగునీరు, వాకింగ్ ట్రాక్ సరిగా లేవని కమిషనర్ దష్టికి వాకర్స్ అసోషియేషన్ సభ్యులు తీసుకురాగా, ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తయిన వెంటనే, సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

సీతమ్మధారలోని స్నేహర్ పార్కును సందర్శించారు. పార్కులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు సరిచేయాలని, లైటింగ్, వాకింగ్‌ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్ పనులు ఈ నెల 9, శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

శరవేగంగా ఆక్వారంగం అభివృద్ధి

ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్

శిక్షణ కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయు రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ప్రజాశక్తి- విశాఖపట్నం: శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న రంగాలలో ఆక్వారంగం ఒకటిగా నిలుస్తోందని ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ఎయు, అవంతి ఆక్వాకల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ష్రింప్ ఫార్మింగ్ అండ్ బెటర్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్' అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ దేశానికి విదేశీ మారకాన్ని తీసుకువస్తున్న రంగాలలో ఆక్వారంగం ఒకటన్నారు. అదే సమయంలో ఈ రంగం అనేక సవాళ్లను ఎదుర్కుంటోందన్నారు. నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం, ఆహారం వంటివి ఎంతో జాగ్రతలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రంగానికి నిపుణులైన మానవ వనరులు పెద్దసంఖ్యలో అవసరం ఉందన్నారు.

మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ ఎయు, అవంతి ఫౌండేషన్ అవగాహన ఒప్పందలో భాగంగా ప్రపంచస్థాయి మౌలిక వసతులను కల్పించి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దామన్నారు. ప్రత్యక్ష శిక్షణ అందించడం ద్వారా శిక్షణార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు కృషి జరుగుతోందన్నారు.

ఎయు,అవంతి ఎఎస్‌డిసి డైరెక్టర్ డాక్టర్ ఎకె రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆలోచనలకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు. ఎయు,అవంతి ఎఎస్‌డిసి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫణిప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చడం జరుగుతోందన్నారు. బిఎఫ్ఎస్‌సి, ఎంఎస్‌సి, బిఎస్‌సి విద్యార్హత కలిగిన 20 మంది తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఎపి నుంచి శిక్షణకు హాజరవుతున్నారన్నారు. 13 రోజులు థియరీ, 17 రోజులు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్రగణేష్, డాక్టర్ డి.సునీల్‌కుమార్, సిహెచ్ బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే అంగన్వాడీల లక్ష్యం

పౌష్టికాహార మాసోత్సవాలలో ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయీదేవి

మాట్లాడుతున్న ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయీదేవి

హుకుంపేటలో గర్భిణులకు సీమంతాలు

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి -పాడేరు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్వాడీలు అందించే సేవలు, కృషి ఎంతో విలువైనవని స్త్రీశిశుసంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి కొనియాడారు. సోమవారం గుడివాడ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, అంగన్వాడీ సేవలు అందుతున్న తీరును పరిశీలించారు పలువురు బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను లాంచనంగా ప్రారంభించారు. అంగన్వాడీల ద్వారా అందుతున్న పోషకాహారం, ఇతర సేవలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలకు సెప్టెంబర్ మాసం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, సిడిపిఒ ఝాన్సీరాణి సూపర్‌వైజర్ ఊర్మిళ, అంగన్వాడీ కార్యకర్త కె.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

హుకుంపేట: గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యానికి మంచిదని ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి అన్నారు.సోమవారం మండలంలోని కోట్నాపల్లి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి బరువు చూసుకుని, బిడ్డ ఎదుగుదలకు తగుజాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సుఖప్రసవంతో ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందన్నారు. సిడిపిఒ సిహెచ్ బాలమణిదేవి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు సిబ్బంది, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అయ్యన్నకు జన్మదిన శుభాకాంక్షలు

శుభాకాంక్షలు చెబుతున్న చిట్టిబాబు, ఇతర నేతలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు ఆ పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబుతోపాటు పలువురు టిడిపి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నర్సీపట్నం వెళ్లి, అయ్యన్నను తన స్వగృహంలో స్వయంగా కలిసి పూలదండలు, పుష్పగుచ్ఛాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బోగస్ ఎస్‌టి కులధ్రువీకరణలపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -జి మాడుగుల : బోగస్ ఎస్‌టి కులధ్రువీకరణలతో విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాలలో ప్రయోజనం పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. నిజమైన ఆదివాసీలు, గిరిజనులకు దక్కాల్సిన హక్కులను, ప్రయోజనాలను పొందుతున్న వారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లాల పునర్విభజనలో ఆదివాసుల భూములు పూర్తిగా అన్యాక్రాంతమౌతున్నట్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిఒ 3రద్దుతో ఏకలవ్య పాఠశాలల్లో ఉద్యోగ నియామకాల్లో స్థానిక ఆదివాసీ గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో బినామీల పేరుతో అక్రమ కట్టడాలపై జెఎసి తరపున కేసులు వేస్తామని స్పష్టం చేశారు.జెఎసి నాయకులు సున్నాయి గంగరాజు, రేగం అప్పలరాజు, కూడా వెంకటప్రసాద్, ఉల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలోని గడుతూరు పంచాయతీ గొంపం రోడ్డు నుంచి కెబి.పాలెం గ్రామం వరకు రూ.70 లక్షలతో సుమారు 2.5 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక ఎంపిపి కొర్రా పద్మ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. గిరిజనుల రహదారి కష్టాలకు శాశ్వతవిముక్తి కలిగించేలా రోడ్డు నిర్మాణం ఉండాలని ఆకాంక్షించారు. సర్పంచ్ కె.అప్పలమ్మ, వైస్‌సర్పంచ్ కె చిన్నయ్య, మాజీ సర్పంచ్ కె బాలయ్య, మాజీ ఎంపిటిసి మాతే అప్పారావు, వైసిపి కన్వీనర్ కె చంద్రపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

8న జి.మాడుగుల మండల సమావేశం

ప్రజాశక్తి -జి.మాడుగుల : జి.మాడుగుల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 8న ఎంపిపి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చంద్రశేఖర్ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో మండల సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర గౌరవ సభ్యులు పాల్గొనాలని కోరారు.